పింఛన్ పెంచేదెప్పుడో?

- ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ
- పెంపుపై ఇంకా నిర్ణయం తీసుకోని ప్రభుత్వం
- ఆశగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులు



పింఛన్ తీసుకుంటున్న వృద్ధులు

బోథ్: అధికారంలోకి వచ్చిన వెంటే వివిధ వర్గాలకు ఇస్తున్న పింఛన్‌ను పెంచుతామని కాంగ్రెస్ గత అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచిపోయాయి. ప్రభుత్వం ఇప్పటి వరకు పెన్షన్ల పెంపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, బీడీ కార్మికులు, బోధకాలు బాధితులు, డయాలసిస్ పేషెంట్లకు నెలకు రూ.2016ల పింఛన్ అందించింది. తమను గెలిపిస్తే, అధికారంలోకి వచ్చిన వెంటనే వీరికి పింఛన్‌ను రూ.4000కు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చింది. దివ్యాంగుల పింఛన్‌ను రూ.6000 చేస్తామని ప్రకటించింది. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయం గురించి ప్రభుత్వంలో ఇప్పటివరకు ఎలాంటి చర్చ జరగలేదు. వరుస ఎన్నికలు రావడంతోనే కొంత ఆలస్యం జరిగిందని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ పెంచాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నిర్ణయం తీసుకోని ప్రభుత్వం..

పింఛన పెంపుపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గత ఫిబ్రవరి నెలలో జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కూడా పింఛన్ల పెంపునకు సంబంధించి ఎటువంటి కేటాయింపులు, ప్రతిపాదనలు ప్రభుత్వం చేయలేదు. పింఛన్ల పెంపుపై మార్గదర్శకాలు కూడా విడుదల కాకపోవడంతో, పెంపు ఇప్పట్లో ఉంటుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లు ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ కింద రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలపైనే ఎక్కువగా దృష్టి సారించింది. పింఛన్ల పెంపుపై అంతగా దృష్టి పెట్టినట్లు కనిపించడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్లను పెంచాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

జిల్లాలో ఇలా..

జిల్లాలో సుమారు 67 వేల మంది పింఛనుదారులు ఉన్నారు. కొత్తగా పింఛన్ కోసం దాదాపు 17 వేల మంది ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం వీరందరికీ రూ.2016లు నెల నెలా పింఛను అందుతుండగా.. దివ్యాంగులకు రూ. 30 16 వేలు అందుతోంది. పింఛన్ పెంచితే జిల్లాలో దాదాపు రూ. 12 కోట్లకు పైగా మరింత భారం పడనుంది.

హామీలు నెరవేర్చాలి



కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు ఇప్పటికే గడిచిపోయింది. ఇంకా పింఛన్ల పెంపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

– అనిల్ జాదవ్, ఎమ్మెల్యే, బోథ్

పింఛన్లు పెంచండి



పింఛన్లు పెంచాలి. కాంగ్రెస్ పెంచుతామని చెప్పి, ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. పెరిగిన నిత్యావసర ధరలతో ఏమీ కొనలేని పరిస్థితి నెలకొంది. పింఛన్ పెంచితే కొంత ఆసరాగా ఉంటుంది. పింఛన్లు పెంచేందుకు చొరవ చూపాలి.

– చింత నవనీత, బోథ్

క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించిన బీఆర్‌ఎస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని కొర్టికల్ గ్రామానికి చెందిన తిత్రే చందర్‌సింగ్‌తో పాటు పలువురు ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తానని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ నానక్ సింగ్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

రేపు బస్సు పాస్‌ల మేళా

ఇంద్రవెల్లి: దివ్యాంగులకు ఈనెల 24న బస్సు పాస్‌ల మేళా నిర్వహించనున్నట్లు ఉట్నూర్ బస్సు డిపో సూపరింటెండెంట్ శకుంతల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాంనగర్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంప్ నిర్వహించి 50 శాతం రాయితీతో బస్సు పాస్‌లు అందించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దుర్గా నవరాత్రి ఉత్సవ కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులతో గ్రామస్తులు

తాంసి: మండల కేంద్రంలో ఆదివారం దుర్గా నవరాత్రి ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని రామలింగేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా గడ్డం సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాహుల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్ రెడ్డి, కోశాధికారిగా లింగన్నతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. దుర్గా నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా అందరి సహకారంతో ముందుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు రాంరెడ్డి, సభ్యులు పరమేష్, ఆశా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఆవిష్కరణకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

బోథ్: మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణకు రావాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను పట్టణ పద్మశాలి సంఘం నాయకులు ఆహ్వానించారు. ఆదివారం నేరడిగొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో గంగుల మల్లేష్, మెరుగు భోజన్న, సురేందర్, దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌కు స్పందన



టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

బోథ్: మండల కేంద్రంలోని ప్రగతి పాఠశాలలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించే భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌కు విద్యార్థుల నుంచి భారీ స్పందన లభించింది. భగత్ సింగ్ జయంతి రోజున విద్యార్థులకు స్కాలర్‌షిప్‌తో పాటు బహుమతులు అందజేయనున్నట్లు జిల్లా అధ్యక్షుడు సుమేర్ పాషా అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులు సిరిపురం దాస్, ప్రేమ్, మున్సిఫ్, నరేశ్, కార్తీక్, సంతోష్, ముఖ్రామోద్దీన్, రాజు, రవి, అజయ్, ఉపాధ్యాయులు అల్లం సాయి కృష్ణ, చంద్రమోహన్, సుకుమార్ పాల్గొన్నారు.

పరామర్శ

తలమడుగు: మండలంలోని మందగూడ గ్రామానికి చెందిన మెస్రం మహేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ వెంకటేశ్, మొట్టె కిరణ్ కుమార్, అభిరామ్ రెడ్డి, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానిస్తున్న సభ్యులు

జైనథ్: ఉత్తమ టీచర్లుగా అవార్డు అందుకున్న దీపాయిగూడకు చెందిన ఉపాధ్యాయులు మద్ది లస్మన్న, శాలిక్‌రావు, సామ సంజయ్ రెడ్డిలను దీపాయిగూడ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం గ్రామంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి రిటైర్డ్ తహసీల్దార్ కోవ మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులను సన్మానించి మాట్లాడారు. సంఘం తరఫున ఇంకా అనేక కార్యక్రమాలు చేపట్టాలని, దీపాయిగూడ గ్రామ సంక్షేమానికి పాటుపడాలని కోరారు. అవార్డు పొందిన ఉపాధ్యాయులను అభినందించి సేవలను కొనియాడారు. ఇందులో సంఘ సభ్యులు శేఖర్ రెడ్డి, మధుకర్ రెడ్డి, దిలీప్ రెడ్డి, కిషన్, గంగారెడ్డి, మారుతి, గంగాధర్, వెంకటి, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న పతంగే బ్రహ్మానంద్

నేరడిగొండ: ప్రతీ కార్యకర్తకు తాను అండగా ఉంటానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. మండలంలోని కోరటికల్(బి) గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త సాబ్లే కేవల్ సింగ్‌ను అక్రమంగా అరెస్టు చేయగా.. ఆయన విడుదలై ఇంటికి వచ్చిన విషయాన్ని తెలుసుకున్న ఆయన ఆదివారం పరామర్శించారు. ఇలాంటి అక్రమ కేసులకు భయపడొద్దని, మీ వెంట ఎల్లప్పుడూ తాను ఉంటానని భరోసానిచ్చారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



ఉద్యోగిని సన్మానిస్తున్న ఉద్యోగులు

తాంసి: ప్రతీ ఉద్యోగి అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు లభిస్తుందని ఆదిలాబాద్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రాజు అన్నారు. ఆదివారం భీంపూర్ మండలంలోని కరంజి(టి) పోస్ట్‌మెన్‌గా నాలుగు దశాబ్దాలకు పైగా సేవలను అందించి ఉద్యోగ విరమణ పొందిన బావురే గౌతం సన్మాన సభకు హాజరయ్యారు. గ్రామస్తులతో కలిసి శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. సరైన రోడ్డు, రవాణా సౌకర్యం లేని సమయంలో వాగులు, వంకలు, బురద రోడ్ల వెంట వెళ్లి పోస్ట్‌మెన్‌గా ఉత్తరాలు చేరవేసేవాడని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కరంజి, గుబిడి, రాంపూర్, కొజ్జన్‌గూడ, కరన్‌వాడీ, అర్లి గ్రామాల వినియోగదారులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వాన్ని మరింత బలపర్చాలి



సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు



దేవాపూర్‌లో..

నేరడిగొండ: దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని మరింత బలపర్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ కోరారు. ఆదివారం మండలంలోని నారాయణ్‌పూర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తల కృషితో గతంలో 12 కోట్ల సభ్యత్వంతో ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ బీజేపీ అవతరించిందన్నారు. ఈసారి రెట్టింపు ఉత్సాహంతో రూ. 25 కోట్ల సభ్యత్వాలే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, సాబ్లే సంతోష్ సింగ్, పరుశురాం, లక్ష్మణ్, తారాసింగ్, కర్తార్ సింగ్, సౌందర్య, న్యాల్‌సింగ్, అమర్‌సింగ్, రాంసింగ్, విజయ్, జ్ఞాన్‌సింగ్, జగదీష్, గణపతి పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని దేవాపూర్ గ్రామంలో బీజేపీ నాయకులు ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడు దాతాజీ కిరణ్ మాట్లాడుతూ.. బీజేపీ సభ్యత్వ నమోదుకు ప్రజల ఆసక్తి చూపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పోచ్చన్న, గంగాధర్, నరేశ్, రామన్న, శ్యామ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవన నిర్మాణానికి కృషి చేయాలి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనం నిర్మాణానికి కృషి చేయాలని మండల దళిత సంఘాల నాయకులు ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గిరిజన సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేశారు. అంబేద్కర్ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు దళితవాడ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, కామ్‌రాజ్ వాగ్మరే, సందీప్, ఉత్తం, ఎండీ జహిర్, సోమోరే నాగోరావ్ పాల్గొన్నారు.

సూర్యనగర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు



ఎస్సైతో మాట్లాడుతున్న గ్రామస్తులు

బోథ్: మండలంలోని సాకెర గ్రామ పంచాయతీ పరిధిలోని సూర్యనగర్ గ్రామంలో గ్రామస్తులంతా కలిసి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈసందర్భంగా సీసీ కెమెరాలను బోథ్ ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. గ్రామస్తులంతా కలిసి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. సీసీ కెమెరాలు ఉంటే దొంగతనం చేసేవారిని సులభంగా గుర్తించవచ్చని అన్నారు. ప్రతీ గ్రామంలో గ్రామస్తులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తమవంతు సహకారాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ధరావత్ గుండెరావ్, జాదవ్ గోపాల్, ధరావత్ రమేష్, జాదవ్ గోపిచంద్, కిశోర్ కుమార్, జాదవ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోచమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామంలో ఆదివారం గ్రామ దేవత మంద పోచమ్మకు కరంజి(టి) గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో పాడిపంటలు సుభిక్షంగా పండాలని, పశుసంపద వృద్ధి, గ్రామస్తులు సుఖసంతోషాలతో ఉండాలని ప్రతీ మూడేళ్లకు ఒకసారి పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గ్రామ బస్టాండ్ వద్ద ఉన్న మంద పోచమ్మకు డప్పుచప్పుల మధ్య పూజలు నిర్వహించగా.. మహిళలు బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ మహాజన్ విఠల్ దేశ్‌ముఖ్, నారాయణ, ప్రతాప్, కల్చప్ యాదవ్, రైతులు పాల్గొన్నారు.

'రిజర్వాయర్ భూనిర్వాసితులకు పరిహారం చెల్లించాలి'



మాట్లాడుతున్న మల్లేశ్

తాంసి: పిప్పల్‌కోటి శివారులో నిర్మిస్తున్న రిజర్వాయర్‌లో సాగుభూములు కోల్పోతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పిప్పల్‌కోటిలో గ్రామశాఖ రెండో మహాసభలు నిర్వహించారు. గ్రామశాఖ కార్యదర్శిగా దోనిపెల్లి స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్ ధరలో ఉన్న విధంగా పరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ ఆశన్న,నాయకులు స్వామి, రాజన్న, ఎస్.కె.హైదర్, తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా పత్తి

- పంటలను ధ్వంసం చేస్తున్న అడవిపందులు
- కాపాడుకునేందుకు రైతుల అష్టకష్టాలు



ఏపుగా పెరిగిన పత్తి



పంట చుట్టూ ఏర్పాటు చేసిన సోలార్ కంచె

సిరికొండ: వర్షాలు సమృద్ధిగా పడ్డాయి. విత్తనాలు అన్ని మొలకెత్తాయి. పంటలు ఏపుగా పెరిగి, ప్రస్తుతం పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలకు జీవం పోసినట్లు అయింది. ప్రస్తుతం మరికొన్ని వర్షాలు కురిస్తే పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంది.

పూత, కాతలతో..

మండలంలో ఈ ఏడాది వర్షాలు అనుకున్న సమయానికి పడటంతో పంటలు మొదటి నుంచే బాగున్నాయి. పత్తి పంట ఆశాజనకంగా ఉంది. ఎలాంటి తెగుళ్ల బెడద లేకుండా ఉంది. దీంతో రైతుల ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. వాతావరణంలో ఒక్కసారిగి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఎండలు దంచికొడుతున్నాయి. ప్రస్తుతం పత్తికి వర్షం తప్పా.. ఎలాంటి ప్రత్యామ్నాయం లేక పోవడంతో అన్నదాతలు వర్షం కోసం ఎదురుచుస్తున్నారు.

పగలు కోతులు.. రాత్రి పందులు..

ఈ ఏడాది పంటలు ఇప్పటి వరకు బాగున్నా.. పంటలను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పగలు కోతులు, రాత్రి అటవి పందులు పంటలను ధ్వంసం చేస్తూ.. విధ్వంసం సృష్టిస్తున్నాయి. అటవీ జంతువులు అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంటలను అటవీ జంతువుల బారి నుంచి రక్షణ కోసం పంట చుట్టూ సోలార్ కంచెలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

అడవి జంతువులతో ఇబ్బంది



పంటలను అడవి జంతువుల బారి నుంచి కాపాడుకునేందుకు ఇబ్బంది పడుతున్నాం. కోతులు, అడవి పందులు పంటలపై దాడులు చేసి ధ్వంసం చేస్తున్నాయి. చేన్లలోకి చొరబడి పత్తికాయాలను తింటున్నాయి.

– ఆవుల రవి, రైతు, సిరికొండ

వర్షం పడితే బాగుండు



పత్తి పంట ఏపుగా పెరిగింది. పూత, కాత మంచిగా ఉంది. పత్తి పంటకు ఇప్పుడు వర్షం చాలా అవసరం. సేలక భూములు కావడంతో భూమి గట్టిపడింది. వర్షం కోసం ఎదురుచూస్తున్నాం

– రుద్రారం మల్లేష్, రైతు, సిరికొండ

అన్ని రంగాల అభివృద్ధికి కృషి

కుంటాల: అన్నిరంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నారాయణరావు పటేల్ పేర్కొన్నారు. కుంటాల గజ్జలమ్మ ఆలయ ప్రాంగణంలో రీడింగ్ రూమ్ నిర్మాణానికి రూ.5 లక్షలు, కుంటాల ఉన్నత పాఠశాల అంబకంటి రోడ్డు నుంచి గజ్జలమ్మ ఆలయం వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.25 లక్షలను ప్రభుత్వం మంజూరు చేయగా.. అందుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని ఆదివారం భైంసాలోని తన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. నిధులు మంజూరుకు కృషి చేసిన మంత్రి సీతక్క, నారాయణరావు పటేల్‌కు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జుట్టు లక్ష్మణ్, మాజీ సర్పంచ్ జుట్టు మహేందర్, వెంకటేశ్, పోశెట్టి, గజ్జారాం పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రనగర్ ఎస్సీ కాలనీలో నివాసముండే విజయలక్ష్మి–రాజ్‌కుమార్ దంపతుల కుమార్తె(18 నెలలు) హైడ్రోసిఫాలస్ వ్యాధితో బాధపడుతోంది. ఈవిషయం తెలిసి బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్.. చిన్నారి వైద్యఖర్చుల నిమిత్తం తన వంతుగా రూ.5వేలను స్థానిక నాయకుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో రాజగంగన్న, కలీల్, గజేందర్, ప్రదీప్, సుమన్, దివాకర్, సుమిత్, అజయ్ తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): రోడ్డు ప్రమాద బాధితులకు ఆదివారం రూ.20 వేలు అందించి అండగా నిలిచారు సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్. మండలంలోని బామ్ని(బి) గ్రామానికి చెందిన ముదోళ్ల చిన్న ముత్యం–లక్ష్మి దంపతులు గతంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వారి ఆర్థిక పరిస్థితి బాగా లేనందున సమత ఫౌండేషన్ వారు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సాహెబ్‌రావు, పీఆర్‌టీ క్రాంతి, సీఈఓ అనిల్, నాయకులు దేవోళ్ల పోశెట్టి, దేవేందర్, రవి, ప్రభాకర్, ముత్యం, లక్ష్మణ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారికి సన్మానం



సన్మానిస్తున్న గోపాలమిత్రలు

తాంసి: భీంపూర్ మండల పశువైద్యాధికారిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న పశువైద్యాధికారి సుభాష్ రాథోడ్‌ను ఆదివారం సన్మానించారు. కరంజి(టి)లో పశువైద్య కేంద్రంలో మండలానికి చెందిన గోపాలమిత్రలు పశువైద్యాధికారి సుభాష్ రాథోడ్‌తో పాటు జూనియర్ పశువైద్యాధికారి రమణయ్యను శాలువాతో సత్కరించారు. మండలంలో రైతులకు అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు ప్రవీణ్, మల్లికార్జున్, నవీన్, అజయ్, సంతోశ్, శ్రీకాంత్, పాల్గొన్నారు.